

# ఐ హేట్ మై లైఫ్

సాయిబ్రహ్మానందం గొర్తి

ఇం టికొచ్చేసరికి అమ్మ రుసరుసలాడుతూ ఉంది. నన్ను చూసీ చూడగానే తన అసహనాన్ని అక్కడున్న వస్తువుల మీద చూపించింది.అకారణంగా కోపం తెచ్చుకోవడం అమ్మల సహజ లక్షణం అనుకుంటాను.

నాకేమీ అర్థంకాలేదు. ఏమీ పట్టనట్లు మేడమీద నా గదివైపుగా వెళ్లాను. బ్యాక్‌పాక్ పక్కనబెట్టి తలుపేద్దామని చూడగానే అక్కడ అమ్మ నిలబడుంది. ఏమయ్యిందన్నట్లు కళ్లెగరేశాను.

"నువ్వు సీనియర్ నైట్ పార్టీకి సైనప్ చేశావా?" మాటలు మెల్లగా ఉన్నా కళ్లలో కోపం లావాలా ఉప్పొంగింది. అవునన్నట్లు తలాడించాను.

"నాతో చెప్పలేదేం?" ఈసారి గొంతు పెగిలింది. ఆశ్చర్యంగా చూశాను. నా నుండి జవాబు రాకపోయేసరికి ఉక్రోషంగా మళ్లా అదే అడిగింది.

"అమ్మా! ఇది ఆర్నెల్ల క్రితం స్కూల్ నోటీసులో ఉంది. డాడ్ చెక్కు రాసిస్తేనే కట్టాను. అయినా ఇప్పుడెందుకిదంతా...?"

"నువ్వు వెళ్లడంలేదు..." గొంతు రెట్టించింది. ఏం? అన్నట్లు కళ్లు చిట్లించి ఆశ్చర్యంగా చూశాను.

"ఆ సీనియర్ నైట్‌పార్టీలో డాన్సులూ, ముద్దులూ ఉంటాయట కదా? నీరు వాళ్లమ్మ చెప్పింది!"

"అమ్మా అది ఒక హైస్కూల్ ఇయర్ ఎండ్ పార్టీ! మా స్కూల్ టీచర్లందరూ ఉంటారు!"

"ఈ సీనియర్ నైట్ ప్రామ్ గురించి నెట్‌లో అంతా చదివాను. నువ్వు వెళ్లడం లేదంతే!"

"అమ్మా...! డాడ్..." అని చెప్పబోతుండగానే నా మాటలు వినిపించుకోకుండా, "డాడ్ కాదు, నే చెబుతున్నాను. వచ్చాక ఆయనే చెబుతారు నీకు..." అనేసి విసురుగా వెళ్లిపోయింది.

ఒక్కక్షణం తల దిమ్ముగా అయ్యింది. ఆలోచిస్తే అర్థమ య్యింది. ఇదంతా నీరూ చేసిన పనే! ఐ హేట్ నీరూ!

*

మూడువారాల క్రితం నుండీ అమ్మ నా ఎడల విచిత్రంగా ప్రవర్తిస్తోంది. అయినదానికీ కానిదానికీ చిర్రుబుర్రులాడుతోంది నామీద. సరిగ్గా రెండు వారాల క్రితం ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. కర్టెసీ నీరూ! యథాలాపంగా స్కూలు నుండి రాగానే అమ్మ అగ్గి మీద గుగ్గిలం అయ్యింది. యుద్ధం మొదలుపెట్టింది.

"ఏంటి? ఫేస్‌బుక్‌లో వాడెవడినో హగ్ చేస్తూ ఆ ఫోటో! తీసెయ్యి. పరువు తీస్తున్నావు కదే? ఇంటావంటా లేవు...!"

ఈ నాలుగు ముక్కలూ విని ఏమీ పట్టనట్లుగా మేడ మీద నా గదికి వెళ్లానా, వెనకాలే వచ్చి, మరలా అదే గోల. చెప్పిందే చెప్పడం! ఇంతకీ నేను చేసిన నేరం ఏమిటంటే నా క్లాస్‌మేట్ విలియమ్‌ని హగ్ చేశాను. ఆ ఫోటో నా ఫేస్‌బుక్‌లో ఇంకో స్నేహితురాలు పోస్ట్ చేసింది.

వీకెండు స్కూల్ టీమ్ టెన్నిస్ మ్యాచ్ గెలిచాక విలియమ్ అభినందిస్తూ హగ్ ఇచ్చాడు. నా ఫ్రెండు వికా అది నా ఫేస్‌బుక్ పేజీలో ఇవాళ ఉదయమే ఫ్రెండ్స్ అందరికీ షేర్ చేసింది. అప్పుడే అమ్మకెలా తెలిసిపోయిందీ? అర్థమయ్యింది. ఇదీ నీరూ చేసిన పనే! నాన్న వచ్చి సర్ది చెప్పినా అమ్మ చల్లబడలేదు. నేను

ఫేస్‌బుక్‌లో లాగిన్ అయ్యి ఆ ఫోటో తీసేవరకూ సతా యిస్తూనే ఉంది.

అంతే, అదేరోజు రాత్రి మా పేరెంట్స్ ఇద్దర్నీ ఫేస్‌బుక్ పేజీలో బ్లాక్ చేసేశాను. మర్నాడు స్కూలుకెళ్లాక నీరూని చెడామడా తిట్టేశాను. తనకేమీ తెలియదంది. అప్పుడు నీరూ ఫేస్‌బుక్ పేజీకెళ్లి చూస్తే తెలిసింది, నీరూ వాళ్లమ్మ నీరూ ఫ్రెండ్స్ లిస్టులో వుంది.

బహుశా, ఇది నీరూ వాళ్లమ్మ నిర్వాకమే అయి ఉంటుందని అర్థమయ్యింది. ఐ హేట్ నీరూస్ మామ్!

*

నీరూ పేరెంట్స్, మా అమ్మానాన్నా ఒకేసారి అమెరికాకి వచ్చారు. అప్పటికి నేనింకా పుట్టలేదు. నీరూకి వాళ్లమ్మ వెనకాలే ఉండి ప్రతీదీ చెబుతుంది. తను కూడా తు.చ. తప్పకుండా నడుచుకుంటుంది. నీరూ ఎక్కడికి వెళ్లాలన్నా బాడీగార్డు వాళ్లమ్మే!

నీరూ ఎస్.ఎ.టి. క్లాసుకెళ్లాలన్నా, పియానో క్లాసుకెళ్లాలన్నా కూడా ఆవిడ వెళుతుంది. ఇది చూసి అమ్మ రెచ్చిపోతుంది. చిన్నప్పుడు అంటే మిడిల్ స్కూల్ వరకు భరించాను. కానీ, హైస్కూలుకొచ్చాక నావల్ల కాలేదు. అమ్మని రావద్దని చెప్పేశాను. దాంతో అమ్మ రెచ్చిపోయేది. మా ఇద్దరి మధ్యా యుద్ధం మొదలయ్యేది. మధ్యలో నాన్న వచ్చి మమ్మల్ని చల్లార్చేవాడు. హైస్కూలు మా ఇంటికి నడిచే దూరంలోనే ఉంది కనక బ్రతికిపోయాను. లేదంటే ప్రతీరోజూ అమ్మ నాతో రావడం అస్సలు ఊహించుకోలేను.

చిన్నప్పుడు అంటే ఎనిమిదో తరగతి వరకూ అమ్మ చెప్పినట్లే చేసేదాన్ని. కానీ నాకూ చుట్టూ ఉన్న ప్రపంచం అంటే ఏవిటో తెలిశాక నాలో మార్పొచ్చింది. అమ్మ చిన్నప్పుడు కర్ణాటక సంగీతం క్లాసుల్లో పెట్టింది. వెళ్లి బుద్ధిగా నేర్చుకున్నాను. కూచిపూడి డాన్స్ క్లాసులు పెట్టింది. వారం వారం వెళ్లి నేర్చుకున్నాను.

నేను మిడిల్ స్కూల్ అయ్యి క్యుపర్టినో మాంటా విస్తా హైస్కూల్లోకి వచ్చిన ఏడాది సమ్మర్‌లో అరంగేట్రం ఇచ్చాను. నేను ఈ బే ఏరియాలో అరంగేట్రం చేసిన వాళ్లల్లో యంగెస్ట్ అని అందరూ అన్నారు. అంత చిన్న వయసులో ఎంత గొప్పగా కూచిపూడి డాన్స్ చేశానో అని అందరూ మెచ్చుకున్నారు కూడా.

ఇవికాక చదువెలాగూ ఉంది. స్కూల్లో నేను మిగతా కార్యకలాపాల్లో ఎక్కువగా పాల్గొనేదాన్ని కాదు. నీరూ మిడిల్ స్కూల్లో డిబేటింగ్ క్లబ్ ప్రెసిడెంటు. ఇయర్ బుక్ టీమ్‌కి లీడర్! తను పాల్గొనని అంశం లేదు.

నేను ఇవేమీ చెయ్యకపోవడంతో అమ్మకి అసంతృప్తిగానే ఉండేది. నాకు టెన్నిస్ ఇష్టం. స్కూలు టీమ్‌లో ఉన్నానంతే!

దీనికితోడు వారాంతరాల్లో నీరూ వాళ్ల కుటుంబం కలిసిందంటే చాలు, నీరూ వాళ్లమ్మ గొప్పల లిస్టు తీసేది. వాళ్లమ్మాయి స్కూల్లో ఏం చేస్తోందీ, ఎంతలా చదువుతోందీ, అన్నింటికన్నా ముఖ్యంగా తన మాట జవదాటకుండా ఎంత వినయంగా ఉంటుందీ, ఇలా సొంత గోలతోనే ఉన్న సమయం కాస్తా అయిపోతుంది. ఇవన్నీ విని అమ్మ నామీద రెచ్చిపోయేది. మెల్లమెల్లగా నీరూని దూరం పెట్టడం మొదలుపెట్టాను. ఐ స్టార్టెడ్ హేటింగ్ నీరూ!

*

నా స్నేహితులెవరూ అమ్మకి నచ్చరు. నేను అమెరికన్లతో తిరిగి పాడయిపోతున్నానని అమ్మ ప్రతీ రోజూ గోల చేస్తుంది.

"నీతోటిదే విజయా వాళ్లమ్మాయి నీరూని చూడు. ఎంత బుద్ధిగా ఉంటుందో? అన్నింట్లోనూ ఫస్ట్! వేసుకునే డ్రెస్ దగ్గర్నుండి ఎంతో ముచ్చటగా ఉంటుంది. ఏం చూసుకొని నీకంత మిడిసిపాటు? నీరూని చూసి నేర్చుకో!" అమ్మ మాట్లాడే ప్రతి వాక్యమూ ఇదే ఉపోద్ఘాతంతో మొదలవుతుంది. విని విని విసుగొచ్చింది.

స్కూల్ నుండి రాగానే అమ్మ చదువు పురాణం విప్పుతుంది. ర్యాంకుల రంధి మొదలవుతుంది. నిజానికి నాకు అన్ని సబ్జెక్టుల్లోనూ మంచి గ్రేడ్సే వస్తాయి. ఒక్కోసారి అవి పడుతూ ఉంటాయి. అవి కిందికి పడినప్పుడల్లా మా ఇంట్లో చిన్నసైజు భూ కంపం కుదిపేస్తుంది, అదేదో జీవితానికి ఆఖరి క్షణాలయినట్లు. ఇష్టం ఉన్నా లేకపోయినా చచ్చినట్లు చదువుతాను, వీళ్ల పోరు పడలేక.

"బాగా చదువుకుంటే మంచి కాలేజీలో సీటొచ్చినా రాకపోయినా, ఈ పేరెంట్స్ గోల తప్పుతుంది. మన ప్రతి కదలిక మీదా నిఘా ఉండదు. దానికోసమయినా మనం చదవాలి," అంటుంది నా స్నేహితురాలు వికా. నాకూ నిజమేననిపిస్తుంది. వికా నా బెస్ట్ ఫ్రెండ్. ఏదైనా కాస్త మనసు విప్పి చెప్పుకోవాలంటే వికాతోనే చెప్పుకుంటాను.

మా కుటుంబం అంటే నాకు అసహ్యం వేస్తోంది. వీళ్లందరికీ దూరంగా ఎప్పుడు వెళ్లిపోతానా అని ఉంది.

ఏదైనా కాస్త సంతోషం, మనసుకి విశ్రాంతి ఉందంటే అది స్కూలొక్కటే. వికా, డెన్నిస్, లీసా, నేహ

వీళ్లందరితో ఉన్న క్షణాలే కాస్త ఉపశమనంగా వుంటాయి. స్కూలు లేని రోజులు నరకం. ఇంట్లోనే పడుండాలి. నా ప్రతి కదలికా భూతద్దపు కెమెరాలో నిక్షిప్తమవుతుంది. రోజులో నేనంటూ హాయిగా గడిపే కాలం ఉదయం ఏడింటి దగ్గర్నుండి మధ్యాన్నం మూడు వరకే! ఇంటికి రావడం అంటే జైలుకి వచ్చినట్లే అనిపిస్తుంది.

ఐ హేట్ మై పేరెంట్స్!

*

అనుకున్నట్లుగానే నాన్న రాగానే అమ్మ ఆయన మీద గట్టిగా అరిచింది. నాన్న ఏం మాట్లాడలేదు. ఆఫీసు, పనీ తప్ప నాన్న ఇంకేమీ అంతగా పట్టించుకోరు. ఎప్పుడైనా ఎలా చదువుతున్నావని అడుగుతారంతే!

''ఏమయ్యిందిరా? ఇంటికి రాగానే ఈ గోల...?'' అంటూ నాన్న నా గదికొచ్చి అడిగారు. జరిగినదంతా చెప్పాను.

''ఇంతకీ నువ్వా ప్రామ్ నైట్‌కి వెళ్లితీరాలా...? అమ్మ అక్కడ ఏదో జరుగుతుందని తెగ భయపడిపో తోందిరా...?'' నాన్న మెల్లగా అడిగారు.

''డాడ్! ఇది మా ఒక్క స్కూల్‌కే కాదు. మొత్తం అన్ని స్కూళ్లల్లోనూ ఉంటుంది. అందరం ఆ రాత్రి అక్కడ పార్టీలో కలుస్తాం. డాన్స్ చేస్తాం. అంతే! అయినా ఇప్పుడెందు కింత గొడవో అర్థంకావడం లేదు...'' నచ్చ జెప్పడానికి ప్రయత్నించాను. నాన్న అమ్మ పేరు చెబుతూ నసిగాడు.

''డాడ్! నీకు గుర్తుందా? నాలుగేళ్ల క్రితం అన్నయ్య వెళ్లాడు కదా? అదే పార్టీ...'' అని చెప్పబో తుండగా అమ్మ వచ్చింది.

''అన్నయ్య వేరు, నువ్వు వేరు. అయినా వాడు మగాడు... ఆ పార్టీలో ఏం జరుగుతుందో నాకంతా తెలుసు. దీని మాటలు మీరు నమ్మకండి. స్కూలంతా ఈ పార్టీకి వెళ్లరు. అక్కర్లేని వాళ్లు మానేయచ్చు. అంతెందుకూ? నీతోటిదే నీరూ వెళ్లడం లేదుగా... నీకెందుకంట...?''

''అమ్మా! నీరు వెళుతుందో వెళ్లదో నాకనవసరం. నేను వెళతానంతే!'' అంటూ ఏడుస్తూ నా గది తలు పేసేశాను.

అమ్మ నాన్నతో వాదించడం చిన్నగా వినిపిం చింది. నేను డాన్స్ బాగా చేస్తానని నా ఫ్రెండ్స్ అందరికీ తెలుసు. ప్రామ్ నైటులో డాన్స్ పోటీ అనుకున్నాం. నా స్నేహితుల గ్రూపంతా నామీదే ఎంతో ఆశలు పెట్టు కున్నారు. నెగ్గితే ప్రామ్ క్వీన్‌గా నేను ఎన్నికవుతానని వికా, అందరూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

సరిగ్గా నాలుగేళ్ల క్రితం అన్నయ్య కూడా ఇదే ప్రామ్ పార్టీకి వెళ్లాడు. నాన్న చేత దగ్గరుండి మరీ టక్సీడో (సూటు) అవీ కొనిపించుకున్నాడు. అవి కొనడానికి వెళ్లి నప్పుడు వాళ్లతో నేనూ వెళ్లాను. వాడికొక రూలు, నాకొక రూలా? స్కూలుకెళ్లి వికాతో చెబితే అందరూ ఒక్కసారి డీలాపడిపోయారు. ఎలా తెలిసిందో మాతో డాన్స్ పోటీ పడేవాళ్లందరూ నన్ను ఆట పట్టించడం మొదలు పెట్టారు. అమ్మ వద్దనడం కన్నా అందరూ నన్ను ఆట పట్టించడం (పిక్ చేయడం) అస్సలు భరించలేక పోయాను. హైస్కూళ్లల్లో ఈ పికింగ్ అన్నది భయంకర మైన మానసిక క్రీడ. అది తట్టుకోవడం ఎవరివల్లా కాదు. దీని ప్రభావం ఒక్కోసారి చదువు మీద కూడా పడు తుంది. ఓరోజు వికా వాళ్లింటికెళ్లినప్పుడు వాళ్లమ్మ దగ్గర ఏడ్చేశాను కూడా.

అమ్మ ఇంట్లో లేనప్పుడు చూసి నాన్నని మళ్లా అడిగాను.

''ఒరేయ్! అక్కడేదో శృంగారం జరిగి నీకేదో అయిపోతుందని మీ అమ్మ భయం! తల్లిగా ఆవిడ బాధ ఆవిడది. అమ్మకే కాదూ, నాకూ భయం ఉంది. నువ్వేమో వెళ్లాలంటావు... ఏం చెప్పాలో తెలీడంలేదు. నా బుర్ర పగిలిపోతోంది తలుచుకుంటేనే! నాకూ తెలుసు, మీ స్నేహితులంతా చివరిసారిగా కలిసి పార్టీ చేసుకుంటున్నారు. నాలుగేళ్ల స్నేహానికీ, స్కూల్లో గడిపిన క్షణాలకీ గుర్తుగా కలుస్తున్నారు. అర్థం చేసుకోగలను. నాక్కొంచెం టైమ్ ఇయ్యి. అమ్మని ఒప్పించడానికి ప్రయ త్నిస్తాను...'' అన్నాడు. ఇంట్లో నాకు బాగా చనువున్నది నాన్నతోనే!

నాకిష్టమైనవేవీ జరగవు. ఐ హేట్ మై లైఫ్!

*

అమ్మ నాతో పూర్తిగా మాట్లాడ్డం మానేసింది. నాకు తెలీని డిప్రెషన్ మొదలయ్యింది. ఇది నా గ్రేడ్స్ మీద కూడా పడింది. ఈ ఆఖరి రెండు క్వార్టర్ల మార్కులూ కాలేజీలు అంతగా పట్టించుకోవు. పాస్ అయితే చాలు. హఠాత్తుగా నీరూ వాళ్ల ఫేమిలీ ఇండియా వెళ్లారని తెలిసింది. ఎందుకంటే నీరూ బామ్మకి సీరియస్‌గా ఉందట. ఇదీ నాన్న అంటూంటే తెలిసింది. నీరూ కూడా స్కూల్లో స్పెషల్ పర్మిషన్ తీసుకొని వెళ్లింది. రోజూ నేను గ్రూప్ స్టడీ పేరు చెప్పి వికా ఇంటికి వెళ్లిపోయేదాన్ని. ఓరోజు నాన్న నన్ను

తీసుకెళ్లడానికి రావడం ఆలస్యం అయ్యింది. వికా వాళ్ల నాన్నతో కలిసి బయటికెళ్లింది. నాన్న వచ్చే వరకూ నేను అక్కడే ఉండాల్సి వచ్చింది. వికా వాళ్లమ్మ నాతో కబుర్లు చెప్పడం మొదలుపెట్టింది. మాటల్లో ప్రామ్ ప్రస్తావన వచ్చింది.

''నా మొట్టమొదటి ప్రామ్ నైట్ నాకింకా గుర్తుంది. ఇటీజ్ ఫన్! రాత్రంతా ఫ్రెండ్స్ అందరూ డాన్స్ చేస్తూ గడిపాం! ఐ లవ్ దట్ నైట్!'' అంటూ ఆవిడ ప్రామ్ నైట్‌కి ఏం షాపింగ్ చెయ్యాలీ, ఏ డ్రెస్సు వేసుకోవాలీ ఇవన్నీ ఎన్ని వారాలు ముందు నుండి ప్లాన్ చేసిందో చెప్పుకుంటూ వచ్చింది. మాటల్లో నా ప్రిపరేషన్స్ గురించి అడిగింది. వెళ్లడం లేదని చెప్పడం ఇష్టం లేక నవ్వేశాను. వికా ప్లాన్ గురించి చెప్పింది. నేను రాకపోవచ్చునన్నట్లుగా ఆవిడతో అన్నాను. వికా అంతా వాళ్లమ్మ దగ్గర చెప్పేశానని చెప్పింది. ఏం మాట్లాడలేదు. ఇంతలో నాన్న వచ్చారు నన్ను తీసుకెళ్లడానికి.

మేం వెళుతుండగా వికా వాళ్లమ్మ నాన్నని అడిగింది.

''రామ్! మీ అమ్మాయి ప్రామ్ పార్టీకి వెళ్లడం లేదని వికా చెప్పింది. ఎందువల్ల? అది ఎవరికయినా జీవితంలో గుర్తుండే రోజు! ఇలాంటివి మీ ఇండియాలో లేవని నాకు తెలుసు. షీ ఈజ్ ఏ గుడ్ డాన్సర్! మీ అమ్మాయి డాన్స్ ప్రోగ్రామ్‌కి వచ్చాను. మీరేం భయపడనవసరం లేదు... వీళ్లందరూ వెల్ బిహేవ్డ్ గర్ల్స్!'' నవ్వుతూ అంది.

''మా కల్చర్‌లో ఇలాంటివి లేవు...'' అంటూ నాన్న నసిగాడు. ఆ మాటలు విని ఆవిడ గట్టిగా నవ్వింది.

''కమాన్ రామ్! దిస్ ఈజ్ జస్ట్ ఏ పార్టీ! నేనూ మీ ఇండియా వెళ్లాను. ఖజరాహో, కోణార్క్ అన్నీ చూశాను. అక్కడ గోడల మీద ఏముందో నీకూ తెలుసు. సెక్స్‌కి కల్చర్ వుండదు. శరీరానికి అదొక అవసరం అంతే! అయినా ఒక్క విషయం! మన పిల్లలు ఎదిగారు, ఎదుగుతున్నారు అన్నది పేరెంట్స్‌గా మనం గ్రహించాలి. గైడ్ దెమ్! అండ్ రెస్పెక్ట్ దెమ్! కట్టుదిట్టం చేస్తే కళ్ల ముందే జారిపోతారు!'' అంటూ నాకేసి చూస్తూ అనేసరికి నాన్న విస్తుపోయాడు.

కార్‌లో పార్టీకి వెళ్లడం లేదన్న సంగతి నేను వాగేనా అని గట్టిగా అన్నాడు. నేనెవరితోనూ అనలేదని, ఒక్క వికాతోనే చెప్పానని ప్రామిస్ చేస్తూ చెప్పాను.

''అమ్మ భయమల్లా ఒక్కటే! నువ్వక్కడ పార్టీలో ఏ అబ్బాయితోనో సెక్స్...'' నాన్న మాటలు అక్కడితో ఆగిపోయాయి. నాన్న నాతో ఇంత ఓపెన్‌గా మాట్లాడ్డం ఇదే మొదటిసారి.

''డాడ్! నన్ను నమ్ము! మీకు తలవంపులు తెచ్చే పనేమీ చెయ్యను... ప్రామిస్!'' అని చేతి మీద చెయ్యేసి అన్నాను.

ఒకటికి రెండుసార్లు తన భయం గురించి చెప్పాడు. అమ్మకి నచ్చచెబుతానని అన్నాడు.

అమ్మ ఎలాగూ ఒప్పుకోదు. ఇంట్లో మరో మూడో ప్రపంచయుద్ధం. ఐ హేట్ మామ్!

*

నాన్న ఏం చెప్పారో తెలీదు. అమ్మ అభ్యంతరం చెప్పలేదు. నాతో మాట్లాడ్డం మానేసింది. నేను ప్రామ్ పార్టీకి వెళ్లాను. నాన్న కూడా వచ్చి దిగబెట్టారు. రాత్రి ఎనిమిది నుండి రెండింటి వరకూ పార్టీ ఉంటుంది. నాన్న పన్నెండుకల్లా వస్తాననీ, ఆ టైమ్‌కి బయటకొచ్చేయాలని షరతు పెట్టాడు. ఒప్పుకున్నాను. అమ్మ మాత్రం రాలేదు. నాన్నలాగే చాలామంది ఇండియన్ పేరెంట్స్‌కి భయం ఉందేమో, పార్టీ జరిగేచోట బయట అక్కడే వున్నారు. నాన్న మాత్రం అక్కడ ఉండకుండా వెళ్లిపోయారు.

రంగు రంగుల దీపాలు, వెనుక సంగీతము, ఎంతో అందంగా తయారయ్యి హుషారుగా ఆడుతూ పాడుతూ సాగే ఆ క్షణాలు మా యువతీ యువకులందరికీ ఓ మధురమైన జ్ఞాపకం. అనిర్వచనీయమైన అనుభూతి. మా గ్రూప్ డాన్స్ పోటీలో నెగ్గింది. నాకు ప్రామ్ క్వీన్ కిరీటం పెట్టారు. ఫ్రెండ్స్ అందరం ఫోటోలు తీయించుకున్నాం. మర్నాడు ఫేస్‌బుక్ నిండా ఇవే వుంటాయని తెలుసు. ప్రతి ఒక్కరం సెల్ఫీలు తీసుకున్నాం.

రాత్రి డిన్నర్ చేస్తుండగా రాబర్ట్ నాపక్కగా వచ్చి నిలబడ్డాడు. రాబర్టు, నేను, మేత్, లిట్ క్లాసుల్లో మాత్రమే కలుస్తాం. అతను మా గ్రూపు కాదు. కలిస్తే హలో అంటే హలో అంతే! ఇతను కూడా డిబేట్ క్లబ్బులో ఉన్నాడు. మంచి గ్రేడ్స్ వస్తాయి. నాతో మాట్లాడాలి పక్కకి రమ్మనమని పిలిచాడు రాబర్ట్. ఏమిటాని వెళ్లాను. అతను చెప్పింది విని షాక్ అయ్యాను. నీరూ రాలేదేమని అడిగాడు. వాళ్ల బామ్మకి సీరియస్ అని చెప్పాను. వెంటనే, తను ఇహ ఇండియాలోనే చదువుకుంటుందట కదా? కాలిఫోర్నియా రాదట కదా? అని అడిగాడు.

నాకేవీ తెలియవనీ, నేను తనతో మాట్లాడననీ చెప్పాను. తను, నీరు డేటింగ్ చేశామని, ఇది ఎవరికీ తెలియదని చెప్పాడు. నేను నమ్మలేకపోయాను.

“నేను, నీరు సెక్సువల్‌గా కలిసిన విషయం వాళ్లింట్లో తెలిసి నీరుని వాళ్లు హింసించారట. తను ఫేస్‌బుక్, ఈమెయిల్స్ అన్నీ బ్లాక్ చేసేసింది. నీరు పేరెంట్స్ అప్సెట్ అయ్యారనీ, ఇహ ఇండియా పర్మనెంటుగా వెళ్లిపోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. ఇందులో నీరు కంటే నా తప్పే ఎక్కువ! అనవసరంగా మేం...” అంటూ ఆగిపోయాడు.

నమ్మబుద్ధి కాలేదు. నిజంగా నాకిది షాక్! ఇప్పుడర్థమయ్యింది, నీరు వాళ్ల ఫ్యామిలీతో కలిసి, స్కూలు మానేసి మరీ ఎందుకు ఇండియా వెళ్లిందో? ఎవరితోనూ చెప్పొద్దని అన్నాడు. ప్రామిస్ చేశాను. నీరు విషయం మనసులో వెంటనే ఇంకలేదు. కొన్ని నిమిషాలు పట్టింది.

రాత్రి పన్నెండవ్వగానే నాన్న వచ్చి బయట వెయిట్ చేస్తున్నట్లుగా ఫోన్‌కి టెక్స్ట్ మెసేజ్ వచ్చింది. అందరికీ బై చెప్పి బయటికి వచ్చేశాను. వస్తూనే నాన్నకి సంతోషంగా థాంక్స్ చెప్పాను. ఇంటికి డ్రైవ్ చేస్తూ పార్టీ ఎలా జరిగిందని అడిగాడు. అన్నీ పూస గుచ్చినట్లు చెప్పాను. నేను ప్రామ్ క్వీన్‌గా ఎన్నికయ్యాననీ చెప్పాను.

“ఇప్పటికీ అమ్మ ఎందుకు వద్దందో అర్థం కావడంలేదు డాడ్!” కారులో పార్టీ కబుర్ల మధ్య అన్నాను.

“ఒక పేరెంట్‌గా భయంరా! యూ హేవ్ టు బి ఏ పేరెంట్ టు నో హౌ ఎ పేరెంట్ థింక్స్! పైగా ఇది మన కల్చర్ కాదు. నువ్వెక్కడ పెళ్లికి ముందే వర్జినిటీ కోల్పోతావో, నిన్ను మనవాళ్లెవరూ పెళ్లి చేసుకోరేమోనని ఆవిడ భయం!”

చటుక్కున అన్నయ్య గుర్తొచ్చాడు. “డాడ్ వర్జినిటీ ఆడవాళ్లకేనా? మగాళ్లకి అవసరం లేదా?”

నా మాటలు విని నాన్న నోరెళ్లబట్టి ఆశ్చర్యంగా నాకేసి చూస్తూ, నిశ్శబ్దంగా ఉండిపోయాడు. నా ప్రశ్నతో నాన్న పడ్డ ఇబ్బంది గ్రహించాను. అలా అడిగి ఉండాల్సింది కాదేమో?

హఠాత్తుగా నీరు గుర్తొచ్చింది. రాబర్ట్ చెప్పింది చెబుదామా అనుకొని ఆగిపోయాను. నావాళ్లలాగే నీరు, అమ్మానాన్నా కూడా ఆలోచిస్తారు కదా? రాబర్ట్ చెప్పింది బయటికి పొక్కనివ్వదల్చుకోలేదు.

“డాడ్! ఒక చిన్న మిస్టేక్ జరిగింది. నేను, విలియం కలిసి డాన్స్ చేశాం. డాన్స్ పోటీ నెగ్గాక నేను చాలా అందంగా ఉన్నానంటూ విలియం ఒక్కసారి నన్ను గట్టిగా ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. నేను వదిలించేసుకున్నాను. నీకు నిజం చెబుతానని అన్నాను కదా...” అంటూ భయపడుతూ ఆగిపోయాను.

ఆశ్చర్యం! నాన్న నన్ను ఏమీ అనలేదు. చిన్నగా నవ్వుతూ నమ్మకంగా నా భుజమ్మీద చేత్తో తట్టాడు.

“నువ్వు నిజం చెప్పినందుకు సంతోషంగా వుంది...” అని మాత్రం అన్నాడు. అమ్మ గుర్తొచ్చింది. నాన్నెలాగూ అమ్మకి చెబుతాడు. ఆవిడ ఇంకో యుద్ధానికి తెర తీస్తుంది.

విలియం నన్ను ముద్దు పెట్టుకున్నట్లు నేను చెప్పిందాంట్లో సగమే నిజముంది. ఆ క్షణాలు నేనూ అమితంగా ఆనందించాను.

మా కారు నెమ్మదిగా శాన్‌ఫ్రాన్సిస్కో నుండి మెల్లగా క్యుపర్టినో వైపు దూసుకెళ్లింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 నవంబర్ 2014*

